నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 6 జనవరి 2025 | NIZAMABAD

- ఎన్నికల హామీ తుంగలోకి..
- రైతుభరోసా రూ.15వేలు బదులుగా రూ.12వేలతోనే సరి
- వానకాలం సాయంపై మాటెత్తని సీఎం రేవంత్
- కొత్త భూపట్టాలు పొందిన వారి పరిస్థితిపై అయోమయం
- ఇప్పటికే యాసంగి పెట్టుబడి సాయం అందించడంలో జాప్యం



భరోసాపై దగా!

మాట మార్చిన కాంగ్రెస్ సర్కార్



నిజామాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతు భరోసా అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి సారి మోసం చేసింది. ఏడాది కాలంగా రైతులను ఊరిస్తూ వచ్చిన సర్కార్ చివరకు ఉసూరుమనిపించింది. ఎకరానికి రూ.15వేలు అందిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.12వేలతోనే సరిపెట్టబోతుండడంతో రైతులు మండిపడుతున్నారు. ఓట్ల వేటలో కాంగ్రెస్ పార్టీ నోటికొచ్చిన హామీలను ఇచ్చింది. రైతు డిక్లరేషన్‌లో రెండో తీర్మానంగా రైతుభరోసాను పెద్దఎత్తున ప్రచారం చేసింది. ఎకరానికి రూ.15వేలు ప్రతి ఏటా ఇస్తామని మభ్యపెట్టి చివరికి ఇచ్చిన మాటను నెరవేర్చకపోవడంపై రైతుల్లో నిరాశ వ్యక్తమవుతున్నది. మరోవైపు జనవరి 26 నుంచి రైతుభరోసా అమలుచేయనుండడంపై రైతుల్లో అయోమయం ఏర్పడింది. కొత్తగా భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోకుండా, బ్యాంకు వివరాలు సేకరించకుండానే పెట్టుబడి సాయాన్ని ఎలా అందిస్తారో చెప్పాలంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి సాంకేతికపరమైన అంశాలపై స్పష్టత కరువైంది. కేసీఆర్ హయాంలో రైతుబంధు పథకాన్ని పకడ్బందీగా అమలు చేశారు. నిజామాబాద్ జిల్లాలో వానకాలానికి సంబంధించి 2లక్షల 82వేల 44 మందికి రూ.274.15కోట్లు మేర పెట్టుబడి సాయాన్ని సాగు కాలానికి తంఛనుగా అందించారు. కామారెడ్డి జిల్లాలో 2లక్షల 71వేల మంది రైతులకు రూ.260కోట్లు వరకు రైతుబంధును జమ చేశారు. ఒక పంట సీజన్‌కు ఉమ్మడి జిల్లాలో ఐదున్నర లక్షల మంది రైతులకు రూ.530 కోట్లు వరకు వెచ్చించారు.

కొత్త భూపట్టాలు పొందిన రైతులకు అందేనా!

మొన్నటి వరకూ గ్రామ సభల్లో రైతులంతా రైతుభరోసా కోసం దరఖాస్తు చేయాలంటూ ప్రభుత్వమే లీకులు ఇచ్చింది. తీరా ఈ విషయంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. దరఖాస్తులు చేయడం భారీ ప్రక్రియ కావడంతో వరుసలో నిలబడడం మూలంగా రైతుల విలువైన సమయమంతా రైతువేదికల వద్దే గడిచి పోయే అవకాశం ఉంది. ఈ పరిస్థితిలో వెనక్కి తగ్గిన సర్కారు ఒకడుగు వెనక్కి తగ్గి పంటలు సాగు చేసిన వారందరికీ రైతుభరోసా అమలు చేస్తామని ప్రకటించింది. గతంలో రైతుబంధు పథకం 2023, వానకాలం వరకు నూటికి నూరు శాతం అమలైంది. గతేడాది యాసంగిలో స్వల్పంగానే అమలు చేశారు. ఈ ఏడాది కాలంలో చాలా మంది రైతులు తమ భూములను అమ్ముకున్నారు. కొత్త వారు భూములు కొన్నారు. ఈ భూ క్రయ, విక్రయాలతో యజమానులు మారిపోయారు. వీరి బ్యాంకు అకౌంట్ వివరాలు వ్యవసాయ శాఖ వద్ద లేవు. దరఖాస్తులు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించకపోవడంతో కొత్తగా రైతుభరోసా పొందాలనుకునే రైతులకు నిరాశే ఎదురవుతున్నది. తమకు రైతుభరోసా ఎలా అమలు చేస్తారో? అని నిట్టూరుస్తున్నారు. పట్టాదారు పాసు పుస్తకం నంబర్ ఆధారంగా రైతుల పేరిట చెక్కులు పంపిణీ చేస్తారా? లేదా అనే అనుమానాలున్నాయి. చెక్కులు పంపిణీ చేయకపోతే బ్యాంకు ఖాతాల్లో రైతుభరోసా జమ చేయాల్సి వస్తే మాత్రం ఏడాది కాలంగా భూములు కొనుగోలు చేసిన వారికి మొండి చేయి ఏర్పడడం ఖాయంగానే కనిపిస్తున్నది. ఈ అయోమయానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని రైతులు కోరుతున్నప్పటికీ వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం తమకేమీ మార్గదర్శకాలు రాలేవంటూ చేతులు ఎత్తేస్తున్నారు.


బోర్లంలో గాంధీ విగ్రహం వద్ద వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు
నస్రుల్లాబాద్‌లో..

వానకాలం సాయానికి మంగళం

రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ఇదీ మూడో పంట సీజన్. ఇప్పటికే రెండు పంట కాలాలు గడిచి పోయాయి. 2023 డిసెంబర్‌లో ప్రభుత్వం ఏర్పాటుతోనే వానకాలం సీజన్ మొదలైంది. ఆ సమయంలోనూ కేసీఆర్ తీసుకు వచ్చిన రైతుబంధు పథకాన్ని అరకొరగా అమలు చేశారు. ఏడాది కాలంగా తాత్సారం చేస్తూ వచ్చిన ప్రభుత్వం ఈ నెల 4న నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో ఏటా ఎకరానికి రూ.12వేలు సాయం చేసేందుకు ఆమోదముద్ర వేసింది. పంటలు సాగు చేస్తున్న రైతులకే పెట్టుబడి సాయం అందిస్తామని స్పష్టం చేసింది. ఇందులో అనేక తిరకాసులు ఉండడంతో రైతుల సాధక బాధకాలను తీర్చేందుకు వ్యవసాయ శాఖ ముందుకు రావడం లేదు. 2023 యాసంగి సీజన్‌లో పెట్టుబడి సాయం దక్కని వారికి పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని రైతులంతా కోరుతున్నారు. 2024 వానకాలం సీజన్‌లో ఏ ఒక్క రైతుకు పెట్టుబడి సాయాన్ని జమ చేయలేదు. ఈ కాలానికి రైతులంతా ఎంతో కాలం సర్కారు సాయం కోసం ఎదురు చూసి అప్పులు చేసి పంటలు సాగు చేశారు. వీరి బాధలు తీరాలంటే గత సీజన్‌కు సంబంధించిన సాయాన్ని రైతులకు ఇవ్వాలంటూ డిమాండ్ వినిపిస్తున్నది.ఏడాది కాలంగా వ్యవసాయ మంత్రి, రెవెన్యూ మంత్రి, ఆర్థిక మంత్రి సహా ముఖ్యమంత్రి వరకూ కల్లబొల్లి మాటలు చెప్పారు. ఇప్పుడిస్తాం అప్పుడిస్తాం అంటూ వాయిదాలు వేస్తూ ఏడాది గడిపారు. తీరా రూ.3వేలు కోత పెట్టి పెట్టుబడి సాయం చేస్తామనడం విడ్డూరంగా మారింది.

'ఎగ్గొట్టిన రైతుబంధు ఎప్పుడిస్తారు సీఎం గారు..'

కాంగ్రెస్ సర్కారు మోసాలపై బీఆర్ఎస్ నాయకుల వినూత్న ప్రచారం

బాన్సువాడ రూరల్/నస్రుల్లాబాద్, జనవరి 5: రైతు భరోసాపై మాట మార్చిన కాంగ్రెస్ సర్కార్‌పై రైతులు, బీఆర్ఎస్ నాయకులు భగ్గుమంటున్నారు. రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేయడం సిగ్గు చేటన్నారు. ప్రతి ఏడాది రెండు పంటలకు ఎకరాకు రూ.15వేల చొప్పున రైతులకు ఇస్తామన్న 'రైతుబంధు ఏమాయే... ఎగ్గొట్టిన రైతుబంధు ఎప్పుడిస్తారూ సీఎం సారూ..' అంటూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వాల్ పోస్టర్లతో వినూత్న ప్రచారం నిర్వహించారు. ఆదివారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని బోర్లం, నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో రైతులకు కాంగ్రెస్ సర్కారు చేసిన మోసాలను వివరిస్తూ ఇంటింటికీ గోడ పత్రులను అంటించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుబంధు పథకం కింద ఎకరాకు రూ. 15వేలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు, ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోచి గణేశ్, మమ్మాయి లక్ష్మణ్, మన్నె అనిల్, శివ, సూరి, రాజ్‌కుమార్, దిలీప్, రమేశ్, సాయి, హన్మాండ్లు, రజినీకాంత్, రాజశేఖర్, నర్సింహులు గౌడ్, సాయిలు పాల్గొన్నారు.

అడుగడుగునా మోసం చేస్తున్న రేవంత్ సర్కార్

బాల్కొండ, జనవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రైతులను అడుగడుగునా మోసం చేస్తున్నది. ఎన్నికలప్పుడేమో రూ.15 వేలు ఇస్తామని ఊదరగొట్టిండ్రు. ఏడాది నుంచి దాని ఊసే లేదు. ఇప్పుడు రూ. 15వేలు కాదని రూ.12 వేలు ఇస్తామని మోసం చేస్తున్నది.

- బాలరాజు, రైతు, బాల్కొండ

రైతులకు అన్యాయం

రేవంత్‌రెడ్డి సర్కార్ అధికారం చేపట్టి సంవత్సరం గడిచినా ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చడం లేదు. అంతేగాక ఇస్తానన్న రూ.15 వేలు ఇవ్వకుండా మోసం చేస్తూ ఇప్పుడు రూ.12 వేలు ఇస్తామనడం సరికాదు. మోసపూరిత మాటలతో రైతులను మభ్యపెడుతున్నది. మాట తప్పిన కాంగ్రెస్ సర్కార్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. ఇస్తామన్న హామీని నెరవేర్చకుండా రైతులను నట్టేట ముంచింది.

-కన్న పోశెట్టి, రైతు, బాల్కొండ

ఇచ్చిన హామీ నెరవేర్చాలి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ప్పటికీ నుంచి రైతుల పరిస్థితి ఏమీ బాగా లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఎన్నో హామీలను ఇచ్చింది. వాటిని ఇంతవరకూ నెరవేర్చడంలేదు. రైతుభరోసా రూ.12 వేలు కాకుండా ఇచ్చిన హామీ ప్రకారం రూ.15 వేలు ఇచ్చి ఆదుకోవాలి.

- ధర్మాయిగారి రాజేందర్‌రెడ్డి, రైతు, బాల్కొండ

రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నది

రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే పట్టించుకోవడంలేదు. నట్టేట ముంచడానికి ప్రయత్నాలుచేస్తున్నది. రైతుభరోసాపై మాట తప్పిన కాంగ్రెస్ సర్కార్‌కు గుణపాఠం తప్పదు.

-అశోక్, రైతు, కిసాన్‌నగర్ గ్రామం, బాల్కొండ

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రైతుభరోసా అమలు

ఇప్పటి వరకు అధికారికంగా మార్గదర్శకాలు ఏమీ రాలేవు. ప్రభుత్వం ఏ విధంగా ఆదేశాలు జారీ చేస్తే ఆ విధంగా రైతుభరోసా అమలు చేస్తాం. కొన్ని సాంకేతికపరమైన సమస్యలపై ప్రభుత్వానికి నివేదించాం. రైతులెవ్వరూ ఆందోళన చెందవద్దు

- కృష్ణ, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి, నిజామాబాద్

మానాల-మరిమడ్ల రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల

ఏడాది కాలంగా అభివృద్ధి పనులు జరగడం లేదు

మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, జనవరి 5: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పనులు తప్ప, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదికాలంగా ఎలాంటి పనులు కొనసాగడం లేదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మానాల-మరిమడ్ల రోడ్డును స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. మానాల -మరిమడ్ల రోడ్డుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఒప్పించి నిధులు తీసుకువచ్చినట్లు తెలిపారు. అటవీశాఖ క్లియరెన్స్ తీసుకొచ్చి పనులు ప్రారంభించామని చెప్పారు. గత ప్రభుత్వంలో చేపట్టిన పనులు తప్ప, కాంగ్రెస్ సర్కార్ హయాంలో పనులు కొనసాగడం లేదన్నారు. మానాల-మరిమడ్ల రోడ్డు ఈ గ్రామస్తుల చిరకాల కోరిక అని తెలిపారు. తాను మానాల వచ్చిన ప్రతిసారి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరేవారని గుర్తుచేశారు. మానాల-మరిమడ్ల రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

నవోదయలో విద్యార్థినులపై లైంగిక వేధింపులు

- పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు
- నలుగురు ఉపాధ్యాయులపై వేటు.. పోక్సో కేసు నమోదు
- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు
- ఇటీవల ఓ టీచర్‌ను కర్ణాటకు బదిలీ చేసిన అధికారులు

బాన్సువాడ, జనవరి 5: నిజాంసాగర్ మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన నలుగురు ఉపాధ్యాయులపై అధికారులు సస్పెన్షన్ వేటు వేయగా.. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై శివకుమార్ ఆదివారం తెలిపారు. నలుగురు ఉపాధ్యాయులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. విద్యాలయంలో కొంతకాలంగా విద్యార్థినులతో కొందరు ఉపాధ్యాయులు అసభ్యకరంగా ప్రవరిస్తూ, లైంగిక వేధింపులకు పాల్పడుతుండడంతో విద్యార్థినులు, తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. దీంతో నలుగురు ఉపాధ్యాయులపై పోక్సో కేసు నమోదు చేయడంతోపాటు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో అధికారులు ఓ ఉపాధ్యాయుడిని వారం రోజుల క్రితం కర్ణాటక రాష్ట్రానికి బదిలీ చేశారు.

ఆందోళనలో తల్లిదండ్రులు

నవోదయ పాఠశాలలో సీటు వస్తే తమ పిల్లలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎంతో మంది తల్లిదండ్రులు కలలు కని, కష్టపడి చదివించాలనుకుంటారు. కానీ కొంత కాలంగా కొందరు ఉపాధ్యాయుల చేష్టలతో పాఠశాలకు చెడ్డపేరు వస్తున్నదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా వ్యవహరించడం, లైంగిక వేధింపుల వంటి ఘటనలు వెలుగు చూస్తుండడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రాబోవు రోజుల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

డిచ్‌పల్లిలో చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న హమాలీలు

కొనసాగుతున్న హమాలీల నిరవధిక సమ్మె

డిచ్‌పల్లి/ ఆర్మూర్ టౌన్, జనవరి 5 : తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఉమ్మడి జిల్లాలోని సివిల్ సప్లయీస్ హమాలీలు చేపట్టిన సమ్మె కొనసాగుతున్నది. సమ్మెలో భాగంగా ఆదివారం డిచ్‌పల్లి, ఆర్మూర్ తదితర మండల కేంద్రాల్లోని ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. డిచ్‌పల్లిలో ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ.. హమాలీలకు పెరిగిన కూలి రేట్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏరియర్స్‌తో కలిపి చెల్లించాలని, స్వీపర్లకు రూ.10లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. హమాలీల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. డిచ్‌పల్లిలో హమాలీ యూనియన్ నాయకులు మోహన్, గౌస్, దిలీప్, జాకీర్, బాలాజీ, నాగనాథ్, మనోహర్, లక్ష్మణ్, సంజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల బారిన పడి యువకుడి ఆత్మహత్య

కమ్మరి గంగరాజు (ఫైల్‌ఫోటో)

లింగంపేట, జనవరి 5: ఇంటి నిర్మాణానికి ఆన్‌లైన్‌లో లోన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఓ యువకుడు సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోవడంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన కమ్మరి గంగరాజు(28) వడ్రంగి పనిచేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి లింగంపేటలో నివాసం ఉంటున్నాడు. ఇంటి నిర్మాణానికి లోన్ కోసం ఆన్‌లైన్‌లో వెతకగా.. బెంగళూర్‌కు చెందిన ఓ కంపెనీ వారు నమ్మబలికారు. అయితే కొంతమొత్తం చెల్లించాలని సదరు కంపెనీ వారు చెప్పడంతో విడుతల వారీగా వారికి రూ. 52, 500 ఆన్‌లైన్ ద్వారా పంపించాడు. రు ణం కోసం కంపెనీకి చెందిన వ్యక్తికి ఫోన్‌చేయగా.. తనకు ఏమీ తెలియదని చెప్పడంతో తాను మోసపోయినట్లు గంగరాజు గ్రహించాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన గంగరాజు శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. శనివారం సాయంత్రం వరకు రాకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం లింగంపేట ఊర చెరువు తూము వద్ద గంగరాజు చెప్పులు కుటుంబీకులు గుర్తించారు. పోలీసులు గజఈత గాళ్ల సాయంతో గాలించగా గంగరాజు మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య సోనీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డికి తరలించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మృతునికి తల్లి అనసూయ, తండ్రి దర్శన్, కూతురు నవ్యశ్రీ ఉన్నట్లు ఎస్సై తెలిపారు.'నా చావుకు వాడే కారణం' అని వాట్సాప్ గ్రూపుల్లో గంగరాజు మెస్సేజ్ పంపినట్లు తెలిపారు.

విరగపూసిన మామిడి

పొతంగల్ కలాన్‌లో..


చందూర్‌లో..

సీజన్‌కు ముందే మామిడి విరగపూసింది. చెట్లు పూలతో అలంకరించినట్లు దర్శనమిస్తున్నాయి. గాంధారి మండలంలోని పొతంగల్ కలాన్, చందూర్ మండల కేంద్రంలోని అల్లమా ప్రభు శివాలయం ఆవరణలో మామిడి చెట్లకు ఆకులు కనిపించనంతగా పూత పూసింది. అటుగా వెళ్లేవారిని ఆకట్టుకుంటున్నాయి. జనవరిలోనే మామిడి చెట్లు పూతకు రావడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

-గాంధారి/చందూర్, జనవరి 5